స్తత్వాలు:

# సరాసరి

"ప్రనీల్"

'మరీ రోజు రోజుకి వీడిట్లా తయారౌతున్నాడేం ? ఇంత లేదు వీడికిప్పటినుంచే ఇవేం బుద్ధులు ? వెధవ వెధవాని. వొళ్లు బలిసి కొట్టుకోటం కాకపోతే మరేమిటి?' అంటూ హుంకరించాడు సూర్యనారాయణ తన కొడుకుని గురించి తల్చుకొని.

'వాడికి పెళ్ళిచెయ్యటం మంచిదండి' అంటూ సలహా ఇచ్చింది రుక్మిణమ్మ.

'ఆ మహాపెద్ద సలహా చెప్పావు. నువ్వూ నీ సలహా ! చాలా బాగుంది. వెధవ రౌడీ వేషాలేస్తూంటే చీల్చి పారెయ్యక చూస్తూ పూరుకుండి ఇంకపైన వాడికి పెళ్ళిచెయ్యమంటావేమిటి ? నీ మొహంలాగుంది నీ సలహా. ఈ పిచ్చినంతా పెండ్లి కుదురుస్తుందా ?...మొన్న ఏం చేశాడు ? పక్కయింటి హెడ్ మాస్టర్ గారి అమ్మాయి పత్రిక పట్టుకెళ్ళామని మనింటికి వస్తే పత్రిక ఇస్తూ చెయిపట్టుకున్నాట్ట. 'ఇదేమిటి ?' అని ఆ అమ్మాయి ఆశ్చర్యపడితే 'ఆ ఏం లేదులే' అంటూ ముద్దు పెట్టుకున్నాట్ట. భయపడి పోయి ఆ అమ్మాయి వాళ్ళింటికి పోయి వాళ్ల నాన్నగారితో చెప్పింది'.

"ఎట్లా చెప్పిందీ !" అంటూ ఆశ్చర్యపడింది రుక్మిణమ్మ.

"ఎట్లా చెప్పిందేమిటి నీ మొహం! ముద్దు పెట్టుకున్నాడని చెప్పింది. మొన్న ఆయనొచ్చి నాతో మొత్తుకుపోయాడు. తల్చుకుంటే ఆయన మనవాణ్ణి స్కూల్లోనుంచి పీకి పారేసుండచ్చు. పెండ్లి కావలసిన పిల్ల—అప్రదిష్ఠ, నలుగురినోళ్ల పాలు అని పూరుకున్నాడు".

"పాపం" అన్నది రుక్మిణమ్మ.

"పాప మేమిటి ? నీ మొహం పాపం ! మన సుపుత్త్రుడు ఇంతటి ఘనకార్యాలు చేస్తూంటే మనమందరం సంతోషించాల్సిందే! పాపంట!" అంటూ ఉత్తరీయం సవరించుకున్నాడు సూర్యనారాయణ.

"వాడికి నేను చెప్పినమాట విని పెళ్లి చెయ్యండి" అంటూ మళ్ళీ అందించింది రుక్మిణమ్మ.

"నువు నోరుముయ్. నువ్వే అసలు వాణ్ణి ఇంత దూరం తీసుకొచ్చావ్. నీ గారాబం నువ్వూనూ ! మొన్న అదీ, మళ్ళీ ఇవాళ ఇదా ! నువు వంట ఇంట్లో వున్నావని పక్కయింటి రాజేశ్వరి నీతో మాట్లాడటానికీ వస్తే, నువ్వు దొడ్లో వున్నావనిన్నీ వంట ఇంట్లో లేవనీ చెప్పకూడదూ వీడు రాజేశ్వరిని వంట ఇంట్లోకి పోనిచ్చి వీడు వెనకనే వెళ్లి, తలుపువేసి, రాజేశ్వరి వెనక్కు తిరగంగానే గట్టిగా పట్టుకొని రవిక లాగేసి......ఛీ, ఛీ" అంటూ చీదరించుకున్నాడు సూర్యనారాయణ, పై ఉత్తరయ్యాన్ని మరొకసారి పట్టుకొని.

"ఐనా పెండ్లయిన మనిషి, తనకన్న పెద్దదనే జ్ఞానమన్నా వుండద్దూ వీడికి ? వెధవ, వెధవ మరీ చూస్తూవున్నా గదూ, నా చేతిలో మూడింది వీడికి" అంటూ రుక్మిణమ్మ మొహాన్ని మరి నాలుగుసార్లు వర్ణించి, ధోవతి గట్టిగా కట్టి బజార్లో పడ్డాడు సూర్యనారాయణ.

♦ ♦ ♦

సాయంత్రానికల్లా సూర్యనారాయణ అక్కయ్య ఆమె కూతురు సత్యవతి వచ్చారు. వాళ్లు రాగానే "ఎప్పుడొచ్చారు ? ఎంతసేపైంది ? అందరూ కులాసాయేనా ? నీ వొంట్లో ఎలా వుంటున్నదీ" మొదలైన ప్రశ్నలన్నీ అడిగి మేనకోడల్ని వేళాకోళంగా "నీ మొగుడు రానిచ్చాడటే, కాకపోతే నువ్వు నీ మొగుణ్ణి ఎలా వొదిలి వచ్చావే ?" అని ప్రశ్నించి, భోజనాలు కానిచ్చారు.

సూర్యనారాయణ కొడుకు చదువుకోటానికి తన సొంత గదిలో కెళ్ళాడు. కొంతసేపటికి సత్యవతి ఆ గదిలోకి ప్రవేశించి తలుపేసి అతన్ని చూసి నవ్వింది. అతను తలను పైకెత్తి చూశాడు.

"ఏం ! అప్పుడే చదువుకోటానికి తయారయావ్ ?" అంటూ మరొకసారి నవ్వింది. సూర్యనారాయణ కొడుక్కి ఏమిటో ఒక రకంగా ఉంది. సత్యవతిని ఆకలి కళ్ళతో చూచాడు. అతనికంటే సత్యవతి రెండేళ్లు పెద్ద. సత్యవతి అదొక రకంగా నవ్వింది. సూర్యనారాయణ కొడుకు ఎందుకనో

కాని భయపడ్డాడు. ఇదేమిటి? తను ఆకలి కళ్లతో ఆ విధంగా చూస్తే భయపడిన ఆడవాళ్ళని చూచాడు. సిగ్గుపడ్డ ఆడవాళ్లని చూచాడు. పైట సవిరించుకున్న ఆడవాళ్లని చూచాడు. పెదిమ కొరుక్కున్న ఆడవాళ్లని చూచాడు. కళ్లు ఓరగా తిప్పిన ఆడవాళ్ళని చూచాడు. ఇవన్నీ అతను ఆహ్వాన సూచకంగా భావించాడు. కానీ, ఇదేమిటి ? సత్యవతికూడా ఇంత ఆకలి కళ్లతో చూస్తుందేమిటి ? కత్తికి కత్తి ఎదురైందేం ?

సూర్యనారాయణ కొడుకు నీళ్ళు నమిలి గుడ్లు మిటకరించాడు. సత్యవతి తన రెండు కళ్లని అతని మీదనే ఉంచి దగ్గరకు వస్తున్నది. అతనికి భయమేసింది. పక్కకు తప్పుకుంటున్నాడు. సత్యవతి దగ్గర దగ్గరకు వస్తూనే వున్నది. ఆ వొణుకుతూన్న పెదిమల్ని చూసి అతను భయపడుతున్నాడు. వూగే ఆ రొమ్మును చూసి జడుసుకున్నాడు. కండలు తిరిగిన ఆమె చేతుల్లో బలం చూసి బెదిరిపోతున్నాడు. అన్నిటికన్నా ఆ కళ్లు...ఆ కళ్లలోని శక్తికి అతని వొళ్ళల్లా చెమట పోస్తున్నది. ఆమె శ్వాస అతడి మొహంమీదకు తగులుతున్నది. ఆ వొణికే పెదిమలు అతని పెదిమల్ని తాకుతై. అదిరిపోతున్నాడు సూర్యనారాయణ కొడుకు.

"సత్యం! కాస్త తమలపాకులు ఇచ్చిపోతావూ" అని పిల్చుకుంటూ సూర్యనారాయణ గది దగ్గరకు వస్తున్నాడు. సత్యవతి రూము బయటికి వచ్చేసింది. చావు తప్పిన మృగంలాగ అలా చూస్తున్నాడు సూర్యనారాయణ కొడుకు.

◆ ◆ ◆

సూర్యనారాయణ అక్కయ్య, ఆమె కూతురు సత్యవతి, వాళ్ల ఊరికి వెళ్ళిపోయారు.

"కొడుకు చెడుబుద్ధులు మానేసి మంచివాడవటం" తన పాతివ్రత్య ప్రభావమే నన్నది సూర్యనారాయణ భార్య. "దాని మొహం దానేద్దున్నది? మన గొప్పకాని" అంటూ గుండె విరిచాడు సూర్యనారాయణగారు.

**30-3-45** శుక్రవారం గొప్ప ప్రారంభము.

స్టార్ టాకీస్ మద్రాసు

(బాంబే టాకీస్ వారి)

★ జ్వార్ భాటా ★

మృదులా, దిలీప్ కుమార్, ముంతాజ్ ఆలి, షామిం, ఆగాజాన్ నటించినది.

★

మరియు దిగువ కేంద్రాలలోగూడ విడుదల యగును.

| | |
|---|---|
| సెలెక్టు, హైదరాబాదు | సెంట్రల్ టాకీస్, మెంగుళూరు |
| 29-3-45 నుండి | 4-4-45 నుండి |

ఈస్టరన్ పిక్చర్సు రిలీజు.